

ఆదిమజాతి జవ్వని
ఫోటో — పి. ఎస్. రావు, భోపాల్ (ఎం. పి.)

సంసారంలో పడిపోయిన వ్యక్తి మధ్య మధ్య విసుగు వలన 'తెలీక రొంపిలో దిగిపోయాను' అనుకుంటుంటాడు. తన విద్యార్థి జీవితంలోని స్వేచ్ఛ, హోటళ్లలో తిని సినిమాలకి వెళ్లిన రోజులు ఏకరువు పెడుతుంటాడు భార్య ముందు— "మ వ్వడుగెట్టిన తరవాత ఇవన్నీ పోయి జైల్లో పెట్టినట్లుంది నాకు" అన్నట్లు.

అయితే ఆవిడ కొన్నాళ్లపాటు దూరమయితేగాని, సంసార జీవితానికి తనెంతగా అలవాటు పడిపోయినదీ తెలియ దతనికి.

నే నిప్పుడు అటువంటి 'తెలుసుకునే' స్థితిలో పడ్డాను. వాయిదా వేస్తూ వచ్చాను మా ఆవిడ ప్రయాణాన్ని. "నే వెళ్లిపోతే మీ హోటళ్లు, సినిమాలు, స్వేచ్ఛ, స్నేహితులు మళ్లీ అన్నీ వస్తాయిగా? నన్ను మా ఇంటికి పంపించేయండి. నాకూ చేసుకునే ఓపిక లేదు" అని ఎన్నిసార్లు అన్నా పట్టించుకోలేదు. మా మామగా రెన్ని ఉత్తరాలు రాసినా లెక్కపెట్టలేదు. చివరి కిక మా అత్తగారు బయలుదేరి వస్తే గతి లేక పంపించాను.

"సెలవు పెట్టి రండి" అంది వెడుతూ సరోజ. ఆవిడకి తెలుసు నే నెంత బింకంగా మాట్లాడినా తన మీద నే నెంత ఆధారపడినదీను!

"నా కేం ఖర్మ" అన్నాను కసిగా. నవ్వింది.

ఇల్లు బోసి పోయింది. బ్రహ్మచారి జీవితం వేరు. 'అందమయిన రోజులు' తెలియకపోవడం వలన అదే మంచి కాల మనుకుంటాము. కాని, జంటగానే బ్రతకడం మొదలుపెట్టాక ఒంటరితనం భరించరానిది.

అప్పుడు నాకు ఇతర కాలక్షేపం కావాలన్న ఆలోచన కలిగింది. అయితే స్నేహితులంతా ఎవరి ఉద్యోగరీత్యా వాళ్లు వెళ్లిపోవడం వలన ఆ లోటు తెలిసి వచ్చింది ఇన్నాళ్లకి. చివరికి చిరాకెత్తి సెలవు పెట్టాను— సరోజని చూసి వద్దామని. అయితే సిగ్గేసింది. మామ గారూ వాళ్లూ ఏమనుకుంటారు? "పంపించి వారమయినా కాలేదు. అప్పుడే తయారయా"డనుకుంటే!

పోనీ, ఆఫీసుకి వెడదామంటే అదంత కన్నా విసుగెత్తిపోయింది. నిజానికి నేను భరించలేనిది ఆఫీసులో పని కాదు, ఇంటిలోని ఏకాంతం. అదీ కనీసం, కొన్నాళ్లయినా వదిలించుకోవాలంటే తిరగాలి. ఎక్కడికి? తేలలేదు.

మొదటి రోజున ఇల్లు సర్దడం అన్న పని పెట్టుకున్నాను. అందుకు నాందిగా ముందు బట్టలబీరువా తీశాను. సరోజ బట్టలు పెట్టుకునే అరలు రెండూ నన్ను చూసి వెక్కిరించాయి. మూసేశాను. పుస్తకాల అలమారా కేసి పోయాను. అక్కడ ఫోటోలు పెట్టిన కవరు, వాటిని అతికించుదామని తెచ్చి అట్టే పెట్టిన ఆల్బమ్ అగపడ్డాయి. సరోజ పోరు పడలేక కొన్నా నా ఆల్బమ్. అయితే అందులో ఫోటోలు పెట్టేపాటి తీరిక ఇద్దరికీ లేకపోయింది. కవరు లోంచి ఫోటోలన్నీ బోర్లించాను కింద. ఎదురుగా ఒక ఫోటో—అన్నిటికన్న కొంచెం పెద్దది—నా దృష్టిలో పడింది.

ఒకసారి ఊరు ఒక సినిమా డైరెక్టరు గారు వచ్చారు, వారి సినిమా విడుదలయిన సందర్భంలో. "సన్మానం చేద్దామేమిటి?" అన్నాడు మా రాఘవరావు.

రాఘవరావు చాలా కాలంగా సినిమా లోకి వెళ్లిపోవాలన్న కోరిక గలవాడు. నటుడుగా కాదు, రచయితగా. అతనిది చాలా అదృష్టజీవితం అని నా నమ్మకం. పట్టిందల్లా బంగారం అయే కోవలో వాడు. కథలు వ్రాయడం మొదలు పెట్టిన కొద్ది రోజులకే అందులో బహుమతులు కొట్టేశాడు. ఆ తరవాత నవలలు వ్రాశాడు. ఎక్కడ కొడితే ఏది మోగుతుందో తెలిసినవాడు. ఏ ప్రక్రియకి ప్రజల్లో డిమాండుందో, ఏది తనకి ఉపయోగమో తెలిసినవాడు కావడాన గభాలున నాటకాలు వ్రాయడం మొదలు పెట్టాడు. అతనికి అవి తెచ్చిపెడుతున్న కీర్తి చూస్తే అప్పుడు తెలిసింది నాటకాల పిచ్చి గలవాళ్లు దేశంలో ఎందరున్నారో! "చేతి చమురు భాగవత మయిన హాబీ నాటకాలేయడం" అన్న నా

## సింగరాజు రామచంద్రమూర్తి

అభిప్రాయం మారలేదు కాని, శిష్యకోటిని ఊరూరా అభిమాన సంఘాల లాగా ఏర్పరుచుకోవాలంటే ఇదొక్కటే మార్గ మని తెలిసింది నా కతణ్ణి చూస్తే.

డైరెక్టరుగారు మా రాఘవతో— "అవునవును. మీ పేరు తెలుసు నాకు. మొన్న మద్రాసులో జూనియర్ ఆర్టిస్టు లంతా కలిసి మీ నాటిక వేశారు. చాలా బాగా వచ్చింది" అని అన్నప్పుడు తెలిసింది నాకు సినిమావారుకూడా నాటకాలని ప్రత్యేకంగా చూస్తారని.

ఏతా వాతా జరిగిందేమంటే, ఆ దర్శకుడుగారిని పట్టుకొచ్చి ఊళ్లో ఉన్న నాటక సంఘాల వారందరి చేతా దండ లేయించి ఆ తరవాత వారందరిని

వక్కొండమని, నా లాంటి వారిని వెనక నుంచోపెట్టి దిగిన ఫోటో ఇది. ముందు వరసలో దర్శకుడుగారు, మధ్యన ఆయన పక్కన రాఘవరావు, మిగిలిన మూడు కుర్చీల్లో సినిమా హాలాయన, డిస్ట్రిబ్యూటర్లు, వెనక వరసలో నేనూ, మా వరసింహం.

ఆఫీసు ఫోటోల్లో ప్యూన్లని వెనక నిలబెడతారు. ఇప్పుడు మా ఇద్దరినీ చూస్తుంటే అది గుర్తుకొస్తుంది. అప్పుడెందు కనిపించలేదో మరి!

తరవాత రాఘవరావు అంచెలంచెలుగా ఎదిగి మద్రాసులో ఇప్పుడొక వర్ధమాన సినీరచయితగా స్థిరపడిపోయాడు.

అక్కడికి వెడితే కాసేపు మాయా లోకం చూసిన తృప్తి మిగులుతుంది. తెరమీద తప్ప బయట ఎన్నడూ చూడని తెరవేలుపులని కొందరినయినా చూడ వచ్చునుకూడా! ఈ పాటికి రాఘవరావు వాళ్లనందరిని 'ఏరా' అంటుండినా ఆశ్చర్యపడవలసినది లేదు. అతనికి అంతగా చొరవ ఉంది.

డైరీలో భద్రంగా వ్రాసుకున్న అతని అడ్రెసు తీశాను. మద్రాసుకి వెళ్లి పోయిన కొత్తల్లో అక్కడి విషయాలు ఎప్పటికప్పుడు తెలియ జేస్తుండే వాడు. ఆదల్లా అలా అలా వారాలు, నెలలుగా మారిపోయింది మా మధ్య ఉత్తరాయణం.

మొదట నేను వస్తున్నట్లు ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. అయితే ఇది అతని కంది మళ్లీ సమాధానం నా కందేసరికి నాలుగు రోజులు పడుతుంది. ఇంత కాలం వృథా చేయడం ఇష్టం లేక రాత్రికే వెళ్లడానికి నిశ్చయించుకున్నాను. రెండు రోజు లక్కడుండి అటునుంచి నేరుగా మా మామగారి ఊరు చేరవచ్చునని నా ఉద్దేశ్యం.

చిన్న బంగళాలా ఉన్నది నా దగ్గరున్న అడ్రెసు ప్రకారం నే వెళ్లిన ఇల్లు. తోటమాలి లాంటి వాడగపడితే అడిగాను— ఫలానా పేరు, సినిమాలకి వ్రాస్తుం టారు ఇదేనా ఇల్లని.

"అవును, సార్. సార్ కంపెనీకి పోయారు, సార్. ఈ ఇంటిలోనే పైన ఉంటున్నారు, సార్ సారు" అన్నాడు.

"పోనీ, అమ్మగారున్నారా?"

"లేరు, సార్. వాళ్ల ఊరు పోయినారు, సార్."

"అయితే ఇల్లు తాళం వేసి ఉందా?"

వాడి కర్థం కాలేదు. "ఫిలిమ్ కంపెనీకి పోయినార్, సార్" అన్నాడు మళ్లీ.

"అడ్రెసు తెలుసా నీకు?"

"మా అయ్యగారికి తెలుసును, సార్. ఉండండి పోయి వేగిరం కనుక్కొని వస్తాను" అంటూ లోపలికి వెళ్లాడు. క్షణంలో ఒక చీటీ తెచ్చాడు. "ఇది, సార్,

# ఆకర్షణ



అయ్యగారుండే కంపెనీ. అమ్మగారు లేరుగదా అని అక్కడే ఉండిపోతున్నారు, సార్."

"హోటలు కదూ ఇది?"

వాడు నవ్వాడు. "అదేలే, సార్, సినిమా వాళ్లంతా హోటళ్లలోనే కదా, సార్, కథలు రాసేది!" వాడిపాటి విజ్ఞానం నాకు లేనందుకు విచారించాను.

ఆరంతస్తుల భవనం ఆ హోటలు. దాన్ని చూస్తూనే కొంచెం ఖంగారు పుట్టిన మాట నిజం. బెదురుతూనే లోపలికి వెళ్లాను. రూము నంబరు తెలుసును నాకు. అయితే అడక్కుండా లోపలికి పోవడం తప్పేమోనన్న అనుమానం కలిగింది. అందుకని కౌంటరు దగ్గరి కెళ్లి మా వాడి పేరు చెప్పాను.

రూమ్ నంబరు చెప్పి, "జస్టెమినిట్, డిస్టర్బు చేయద్దని ఫోను చేశారు వాళ్ల ప్రొడ్యూసర్. డిస్కషన్‌లో ఉన్నారట" అన్నాడు ఇంగ్లీషులో.

ఇంత దూరం వచ్చి కనీసం కలుసుకునే వీలు లేకుండా ఎంతసేపని నిరీక్షణ? పైగా నేను వచ్చానని చెబుతే. . .

"చూడండి, అతను నా బెస్టు ఫ్రెండు. నేను వచ్చానని రింగ్ చేసి చెప్పండి. కావాలంటే నేను మాట్లాడుతాను" అన్నాను ఇంగ్లీషులోనే. నే నెవరి నయినా ఇంగ్లీషువాడి ధర్మమా అని నేర్చిన ఇంగ్లీషు, నే వేసిన డ్రెస్సు నా గౌరవం పెంచకపోవు.

నా వంక చూసి, "తిడతారు, సార్. అసలే ప్రొడ్యూసర్ కోపిష్టి. ఎప్పుడూ మా హోటల్లోనే వారికి రూమొకటి ఉంటుంది" అని అంటూనే ఫోను చేశాడు.

అవతలనుంచి కరుస్తున్నట్లు గొంతు వినపడింది. నాకే జంకు పుట్టింది.

కాని, అతను ధైర్యంగా—"రైటరు గారి కోసం ఎవరో వారి ఫ్రెండుట వెయిట్ చేస్తున్నారు, సార్" అన్నాడు తెలుగులో.

ఇందాకటినుంచి నేను వీడే అరవ వాడో, ఇంగ్లీషువాడో అనుకుంటున్నాను.

"రమ్మంటున్నారు, సార్, మిమ్మల్ని" అన్నాడు నా వంక తిరిగి.

"ఎవరు చెప్పారు?"

అతను నవ్వుతూ, "భయం లేదులే, సార్, మీ ఫ్రెండే చెప్పారు. మాట్లాడతారా?" అన్నాడు.

అతని చేతిలోంచి రిసీవర్ అందుకున్నాను. "మీ రిక్కడున్నట్టు ఎలా తెలుసు?" అంటున్నారెవరో మెల్లిగా. మౌత్‌పీస్ మూసేసినట్లున్నాడు మా వాడు. అతని మాటలు వినపడడం లేదు.

"రాఘవరావు!" అని పిలిచాను.



ఆంధ్రప్రభ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పనివారల సంక్షేమనిధి తరఫున సిబ్బంది పిల్లలకు పుస్తకాలు, దుస్తులు, శ్రీమతి జె. ఎస్. మణి పంచిపెట్టారు.

## 'ఆంధ్రప్రభ' ఉద్యోగుల పిల్లలకు పుస్తకాలు, యూనిఫారముల పంపిణీ

'ఆంధ్రప్రభ' ఉద్యోగుల సంక్షేమ నిధి ఆధ్వర్యాన జులై 15 వ తేదీ సాయంత్రం విజయవాడ 'ఆంధ్రప్రభ' కార్యాలయంలో జరిగిన సభలో 'ఆంధ్రప్రభ', 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఉద్యోగుల పిల్లలకు పాఠ్య పుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫారములు శ్రీమతి జె. ఎస్. మణి బహూకరించారు.

సభకు ఆంధ్రప్రభ అక్కౌంటెంట్ శ్రీ ఎమ్. నాగేశ్వరరావు అధ్యక్షత వహిస్తూ, ఈ సంక్షేమ నిధి ప్రారంభించి ఒకటిన్నర సంవత్సరాలు అయినదని, కార్మికులకు ఇది ఎంతో మేలు కలగజేస్తున్నదని అన్నారు.

'ఆంధ్రప్రభ' మేనేజరు శ్రీ జె. ఎస్. మణి మాట్లాడుతూ 'ఆంధ్రప్రభ' కార్మికులు నెలనెలా అర్ధరూపాయి విరాళం చెల్లించి, ఆ మొత్తంతో ఆపదలో ఉన్న తోటి కార్మికుని ఆదుకోవడమే నిధి ఏర్పాటులో గల ఉద్దేశ్యమని తెలిపారు. ఈ విరాళాన్ని అర్ధరూపాయినుండి రూపాయికి పెంచాలని, ప్రతి కార్మికుడు ఇందులో సభ్యుడుగా చేరాలని ఆయన విజ్ఞప్తి చేసి, నిధికి రు. 500 లు విరాళంగా ఇచ్చారు. పుస్తకాలు, పలకలు, దుస్తులు మొదలగునవి కంపెనీ ఉచితంగా అందజేస్తున్నదని తెలిపారు. శ్రీమతి మణి సంక్షేమ నిధికి రు. 101 విరాళం అందజేశారు.

తొలుత సంక్షేమ నిధి అధ్యక్షులు శ్రీ డబ్ల్యు. ఎస్. శ్రీనివాసన్ స్వాగతం పలుకుతూ ఈ సంక్షేమ నిధి ఇంతవరకు కార్మికుల కుమార్తెల వివాహ సందర్భంగా 19 మంగళ సూత్రములను బహూకరించినదని, ఆపదలో ఉన్న 16 మంది సభ్యులకు రు. 50 లు చొప్పున సహాయం అందజేసిందనీ, గత ఏడాది 80 మంది పిల్లలకు, ఈ ఏడాది 125 మంది పిల్లలకు పుస్తకాలు, యూనిఫారములు పంపిణీ చేశాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా నిధి సేకరణకు సావనీర్ ప్రచురించదలచినట్లు ఆయన వెల్లడించారు. విజయవాడ నుండి మద్రాసుకు బదిలీ అయి వెడుతున్న శ్రీ మణికి, ఆయన సతీమణికి సభ నిర్వాహకులు నూతన వస్త్రాలు బహూకరించారు. శ్రీ బి. ఎస్. సాంబశివరావు వందన సమర్పణ గావించారు. *

"ఎప్పుడొచ్చావ్?" అన్నాడు.

"ఇంత క్రితమే! మీ ఇంటికి వెడితే అక్కడ తోటమాలి ఎవడో ఉన్నాడు. వాడీ అడ్రెసు ఇచ్చాడు" అన్నాను.

పక్కనున్న వాళ్లకి చెబుతున్నాడు నా మాటలు మా రాఘవరావు. "అలా ఇచ్చిరాకండి, గురువుగారూ. చూడండి . . ."

మధ్యలోనే మా వాడు— "అతను నా ఫ్రెండండి" అన్నాడు. "ఆఁ మీకు దేశంలో సగం మంది స్నేహితులే! ఈయన పరేననుకోండి. మరిలా ఎవరయినా వచ్చి పడిపోతే తెమిలే దెలా?" బొంగురు గొంతు వినపడింది.

నా కిదంతా చిరాగ్గా ఉంది. "రాఘవ రావ్!" అన్నాను.

"హల్లో! పైకి వచ్చేయి, గురూ. కాసే పీ పనయిపోయాక ఇంటికి వెళ్లి పోదాం" అన్నాడు రాఘవ.

ఫోను కట్టయిపోయింది.

ఒక్క నిమిషం తిరిగి వెళ్లిపోదామనిపించింది. కాని, ఇంత ఖర్చా పెట్టుకు వచ్చి ఆదేమంత వివేకమయిన పని కాదని లిఫ్టు కేసి బయలుదేరాను.

"లిఫ్టుంది, సార్!" కౌంటరు వినయంగా అన్నాడు.

అదెక్కడుందోనని చుట్టూ చూస్తే పక్కగానే కనపడింది. అందులో కుర్రాడొకడు నిలబడి ఉన్నాడు. 'బహుశా ఆపరేటరయి ఉంటాడు' అనుకుంటూ దానిలోకి అడుగేశాను.

రాఘవరావు తలుపు తెరిచి, "లోపలికి వచ్చి కూర్చో, గురూ, వెళ్లిపోదాం" అన్నాడు.

లోపలికి నడిచాను. అక్కడింకా నలుగురున్నారు. మధ్య టేబుల్ మీద సీసాలున్నాయి. జీడిపప్పులు, పకోడీలు, చిప్సు ఉన్నాయి. గ్లాసులున్నాయి. అందులో కొన్నిటిలో ద్రవం ఉంది. అక్కడంతా పొగ కమ్మేసి ఉంది. అక్కడంతా మందు వాసన ఘుమఘుమ లాడుతూంది. అక్కడున్నవార్ని కళ్లన్నీ ఎర్రగా ఉన్నాయి. వాళ్ల ఒంటిని లక్ష్మి పట్టుకు వేళ్లాడుతూంది.

లక్ష్మికి, సరస్వతికికూడా మందు కొట్టడం నేర్పేశారేమో ననిపించింది.

"ఇతను నా ఫ్రెండు మూర్తి. మా ఊరునుంచి వచ్చాడు. . . ఈయన మా డైరెక్టరుగారు. ఈయన మా ప్రొడ్యూసరుగారు. వాళ్లిద్దరూ డిస్ట్రిబ్యూటర్స్!" అంటూ అందరి పేర్లూ చెప్పాడు.

నమస్కారం పెట్టాను. వాళ్లూ పెట్టారు. వాళ్లకి నా మీద ఎటువంటి ఉత్సాహమూ లేదని ముందే గ్రహించాను. అయితే నా రాక వాళ్ల నిబ్బందితో పెట్టిందని వాళ్ల చూపుల్నో గ్రహించాను.

"కూర్చో, గురూ" అన్నాడు రాఘవ.

ఒకాయన గ్లాసులో కాస్త పోసి నా ముందుకి జరిపాడు.

"పుచ్చుకోడండి. ఏం గురూ, ఈ మధ్య నేమయినా మొదలెట్టావా?" అన్నాడు రాఘవరావు.

"లేద"న్నాను.

దానితో వాళ్లకి నా మీద చాలా చిన్న చూపు కలిగింది. "ఊఁ కానివ్వండి" అన్నాడు బొంగురు గొంతాయన. ఆయనే ప్రొడ్యూసరు.

"ఎంతదాకా వచ్చాము?" అన్నాడు రాఘవ.

ఎవ్వరికీ గుర్తున్నట్లు లేదు. ఈ ఇబ్బందికి నేనే కారణమన్నట్లు నా వంక చూసి గబగబ తలొక గ్లాసూ గొంతులో పోసుకున్నారంతా.

కాసేపు సకిలించినట్లు శబ్దాలు చేశాడు రాఘవ. ఇదివరకెప్పుడయినా సరదాకి తాగేవాడు. ఇప్పుడు అది పడితే గాని, పని చేయలేనట్లు తయారయి పోవడం నాకు వింతఅనిపించింది.

"వచ్చేశాం. . . బొడ్లో కత్తిమీద వాడి చేయి బిగిసింది" అన్నాడు రాఘవరావు.

"అవునవును. బిగిసింది. ఇక చెప్పండి" అన్నా రంతా నవ్వుల మధ్య.

"అడుగు లేస్తున్నాడు. అతని మనస్సులో ఉదయం జరిగిన సంఘటన మెదులుతూనే ఉంది— ఫ్లాష్‌బాక్.

తమ న్యాయమయిన హక్కుల కోసం కార్మికులంతా అడిగారు యజమానిని. తను ముందుకు వెళ్లి ఆయన ఎదురుగా నిలబడ్డాడు. 'బాబుగారూ, మీ కీ సంవత్సరం డెబ్బయి లక్షలు లాభం వచ్చింది. అందులో ఒక్క లక్ష మా కందరికీ బోనసుగా ఇప్పించండి' అన్నాడు తను.

'లేదు, నాయనా. లాభం వచ్చిందని నీకు చెప్పిన వాడెవడు? నా ముందుకు తీసుకురా' అన్నాడు భుజంగరావు.

'నేను చెప్పాను' అంటూ ముందుకొచ్చింది మధు.

'నువ్వా? నీ కెలా తెలుసు?'

'మీరేగా చెప్పారు? నాన్నా, కాదనకండి— పేద ప్రజల రక్తం తాగడం మానండి, నాన్నా" అంది క్లోజప్పులో.

'ఇవ్వకపోతే ఏం చేస్తారేమిటి?' అన్నాడు భుజంగరావు, తన వంక తిరిగి.

'మా సంఘటిత శక్తి రుచి చూపిస్తాం.'

---

**షష్టిపూర్తి**

**అరవైఏళ్లు వచ్చేసరికి మనిషి సాధారణంగా అన్ని అగడ్తలను, తుఫానులను అధిగమిస్తాడు. ఆపైన శత్రువులంటూ ఎవరూ ఉండరు. అందుకే అరవై నిండిన తరవాత, జీవి పునర్జన్మ ఎత్తినట్లే.**

—జార్జి లుక్స్

**రాయబారి**

**రాయవారి అనేవాడు తన దేశ సంక్షేమంకోసం ఇతర దేశాలకు వెళ్లి అబద్ధాలు చెప్పి, కుట్రలు పన్ని, కుతంత్రాలు జరిపే పెద్ద మనిషి.**

—వోట్టన్

---

'నడుం కడతాము వర్గపోరాటానికి!' అంది మధు. . ."

రాఘవరావు చెబుతున్నదానికి ప్రొడ్యూస రడ్డంపడి, "డైరెక్టరుగారూ, నడుం బాగా గట్టిగా కట్టించండి. అప్పుడు సెక్స్..." అన్నాడు.

"చూద్దురుగాని, గురువుగారూ, ఎలా ఎక్స్‌ప్లాయిట్ చేస్తానో ఈ సీను" అన్నాడు డైరెక్టరుగారు.

రాఘవరావు మళ్లీ మొదలెట్టాడు. "ఫ్లాష్‌బాక్‌లోనే పోలీసులు రావడం, కార్మికులను కొందరిని జైల్లో పెట్టడం చూపిస్తాం. వేణుకి కోపం పట్ట పగ్గాలు లేకపోయింది. 'భుజంగాన్ని చంపడమే కర్తవ్యం' అనుకున్నాడు. కత్తి పుచ్చుకుని బయలుదేరాడు.

భుజంగరావు ఇల్లు. నీటిగొట్టం పట్టుకుని పైకి పాకాడు వేణు. కిటికీ లోంచి లోపలికి వెళ్లాడు. కత్తి చేతిలోకి తీసుకున్నాడు. కట్. మంచంమీద ఆకారం క్లోజప్. కట్. కత్తికి క్లోజప్. కత్తి చేయి ముందుకు వంగింది. చటుక్కున ఆ చేతి నొక చేయి పట్టుకుంది. ఆ ఊపుకి గాజులు ఘల్లుమన్నాయి."

"గాజులా?"

నవ్వాడు రాఘవరావు. "అదే మరి" అంటూ ఒక గ్లాసులోకి సీసాలోది వంచుకున్నాడు.

" 'మధూ, నువ్వా?' అన్నాడు వేణు.

'అవును, వేణూ, నేనే. నువ్వీ అఘాయిత్యం తలబెడతావని నేను ముందే అనుకున్నాను. అందువల్లనే మా నాన్న బదులు నే పడుకున్నా నీ మంచం మీద.'

'మధూ, ఎందు కిలా చేశావు?'

'నీ భవిష్యత్తు ఏమయిపోతుంది? హంతకుడివిగా కోర్టులో నిలబడతావా?'

ప్రొడ్యూసరుగారు అడ్డం పడ్డాడు. "దీన్నిగదరగా, తండ్రి పోతాడని దిగులు కాదన్న మాట లంజకి."

అందరూ నవ్వారు.

నాకూ నవ్వొచ్చింది. ఇక్కడున్న వాళ్లంతా లక్ష్మీపుత్రులు. సామాన్య కుటుంబానికి నెలంతా సరిపోతుంది ఇక్కడి ఒక్కొక్క సీసా ఖరీదు. ఈ కార్మిక నాయకుడు వేషం వేసే ఆయనకి, ఆ మధు వేసే ఆవిడకి నలుపూ తెలుపూ కలిపి లక్షలాస్తి ఉంటుంది. వాళ్లూ మందు కొట్టి వేస్తారు బహుశా. వీళ్లంతా కలిసి పేదప్రజల కథలు లక్షలు పెట్టి రంగుల్లో తీస్తారు. ఆ వెర్రివాళ్లు రోజూ ఆ కష్టాలనే చూస్తున్నా, రంగుల్లో తమ అభిమాన నటుల కష్టాలు చూసి తరించేందుకు భోజనాలు మాని ఈ సినిమాకి కనకవర్షం కురిపిస్తారు. దీని విజయాన్ని ఖరీదయిన హోటళ్లలో ఖరీదయిన మందుతో జరుపుకుంటారు వీళ్లంతా.

నా కక్కడ ఉండ బుద్ధి కావడం లేదు. వాళ్ల చర్చ ముగిసేలా లేదుకూడా. మధ్య మధ్య తాగుతున్నారు. ఏ సీనులో ఎంత సెక్స్ ఉండాలో చర్చించుకుంటున్నారు. "భుజంగపాపు మీద వేణు విజయానికి కార్మికులంతా ఉత్సవాలు జరుపుకుంటారు" అని రాఘవరావు అనగానే— "అక్కడ డాన్స్ పెడతాను. కార్మిక స్త్రీలందరికీ గోచీలు గట్టిగా బిగించి డాన్సేర్పాటు చేస్తే బ్యూటిఫుల్‌గా వస్తుంది" అన్నాడు డైరెక్టరుగారు.

"డాన్స్‌లో లీడ్‌కి. . .ని పెడదాం. తొడ లూపుతుంటే ఏక ఎగబడతారు జనం. అన్నట్లు ఈ రోజు ఆవిణ్ణి బుక్ చేయాలి—గుర్తుంచుకోండి."

"లేకపోతే ఒక పని చేద్దాం. కార్మికులంతా కలిసి కలగంటారన్న మాట. అప్పుడు డ్రీమ్‌సీక్వెన్స్ పెట్టచ్చు. ఒక్కటయినా అటువంటిది ఉండాలి జనానికి. ఎటు చూసినా ఖరీ దగబడాలండి, బాబూ, ఈ రోజుల్లో" అన్నాడు డిస్ట్రిబ్యూటరు.

"అంతా కలిసి కలగనడమేమిట్రా నీ బొంద" అన్నా డింకొక కాయన.

లేచాను. ఎవ్వరూ నన్ను పట్టించుకో లేదు. మెల్లిగా తలుపు తెరుచుకుని బయటికి వచ్చాను. వెనక తలుపు వేసేస్తే ప్రాణం తెరిపి అనిపించింది. లిఫ్టుమీద పైకి వెళ్లాను. చల్లటి గాలి. చుట్టూ

ఊరంతా ఎంతో అందంగా కనపడు తూంది.

అలా చూస్తూ గంట పైన గడిపాను. మళ్లీ విసుగేసి గదిలోకి వెళ్లాను.

"వర్షం వచ్చేస్తుంది. ఎటు పోవాలో తోచలే దిద్దరికీ. ఎద్దుబండి ఒక టగపడింది. దాని క్రింద చేరతారు. బట్టలు బండికి అతుక్కుపోతాయి మధుకి."

"కవిగారు బ్రహ్మాండంగా పేనారు. ఇందాకటినుంచి అదే అనుకుంటున్నాను— వర్షం లేదేమా అని. ఇప్పుడు చూడండి అదిరిపోవాలి ఈ సీను. 'న్యూవేవ్' పిక్చర్‌లాగా 'పెద్దలకు మాత్రమే' సర్టిఫికెట్టు సినిమాకి— ప్రొడ్యూసరు గారికి లక్ష్మీప్రసన్నం."

"అదెందుకు? ఉన్నవాళ్లు చాలకనా?" అన్నాడు ప్రొడ్యూసరు.

గొల్లున నవ్వారు డైరెక్టరు, రాఘవ రావు. "అది కాదండి, బాబూ, లక్ష్మీదేవి దయ అన్న మాట. బాక్సాఫీసు హిట్టన్న మాట."

"అదా, అలాగే చేదాం" అన్నాడు ప్రొడ్యూసరు.

"రాఘవా!" అన్నాను బెరుగ్గానే.

"ఏమిటి, గురూ" అన్నాడు గ్లాసు కింద పెట్టి రాఘవరావు.

"నే నలా వెళ్లొస్తాను" అన్నాను.

"దట్స్ గుడ్! ఎన్నిటికి వస్తావు తిరిగి? మే మలా హీరోగారింటికి వెళ్లొస్తాము. కథ వినిపించి ఆయన ఓ. కె. చేస్తే ధన్యుల మవుతాము."

"ఎందు కొప్పుకోడండి, గురువు గారూ, మందుగుండు సామానంతా పెట్టారుగా!"

"అవుననుకోండి. అయినా ఏం చెప్పగలం?"

"భలేవారు. ఆయనా ఒప్పుకుంటాడు, ఆ మాట వినగానే. ఆవిడా ఎగిరి గంతే స్తుంది. వారి మాట వీరికి వేదంగదా!"

"నే వెడుతున్నా, రాఘవా."

"ఒక పని చేయు, గురూ. తాళంచెవి ఇస్తాను. ఇంటికి వెళ్లి హాయిగా పడుకో. మా కీ రోజంతా వారి సేవే సరిపోతుం దనుకుంటా. ఏం సార్?" అడిగాడు డిస్ట్రిబ్యూటర్ని.

"మధ్యాహ్నం భోజనాల ముందుగా రమ్మన్నాడు. ఆయన పన్నెండుకి ఇంటికి చేరుకుంటాడట. మన ఖర్మ కాలి ఆలస్యం అయితే. . ."

నేను బయటికి నడిచాను వాళ్ల హోరు భరించలేక. రాఘవరావు ఇంటి తాళంచెవులు నా దగ్గరనే ఉన్నాయి కాని, అతను లేకుండా నాకు అక్కడికి వెళ్లడం ఇష్టం లేక ఒక హోటల్లో గదొకటి తీసుకుని మూడు రోజుల్లోనే ఊరంతా తిరిగేశాను.

నే నెప్పుడు వెళ్లినా—"హీరోగారు హీరోయిన్ను ఒప్పేసుకున్నారు" అన్న ఆనందంలో విపరీతంగా తాగేసి పడిఉండే వాళ్లు జనం అంతా! కనీసం ఒకసారి స్టూడియోలూ అవీ చూద్దామన్న యావ మిగిలిపోయింది నాకు. బయట చూసే వన్నీ చూడగలిగాను కాని, షూటింగులు వగైరాలకి సినిమా పక్షుల సిఫారసు కావాలి మరి!

రాఘవరావు దగ్గరికి వెళ్లాను. నే నింకా తనింట్లోనే ఉంటున్నానని అతని ఉద్దేశ్యం లాగుంది. "మా ఆవిడ వచ్చేసిందటగా!" అన్నాడు.

నవ్వాను నేను.

"ఇందాకా బట్టల కోసం మనిషిని ఇంటికి పంపించాను. ను వ్వుంటావని చెప్పి పంపించాను. నువ్వు లేవు టేమిటి? ఈ రోజా కేరళ పోతున్నాం ఔట్‌డోరు లొకేషన్స్ ఫిక్స్ చేసుకునేందుకు."

"ఎప్పుడొస్తావు మళ్లీ?"

"నాలుగయిదు రోజులు పడుతుందిలే! ఏం డైరెక్టరుగారూ?"

"వారం పట్టినా పడుతుంది. ప్రొడ్యూసరుగారు మనకూడా ఉంటే మన కింక ఎన్నాళ్లుంటే బాధేముంది, గురూగారూ" అన్నా డాయన అర్ధ నిమీలిత నేత్రుడై.

ప్రొడ్యూసరుగారు ఈ లోకంలో లేరు— కనీసం ఒక పీపా వెళ్లి ఉంటుంది ఆయన కడుపులోకి.

"హీరోగారు కాల్‌షీట్స్ ఇచ్చేశారు. వచ్చే నెలాఖరులో సెట్స్‌కి వెడతాం."

"ఆఖరేమిటండి, బాబూ, పదహారున మొదలు. ముహూర్తం పెట్టించేస్తే . . . అన్నట్టు ఆవిడ రమ్మంది-ఎప్పుడు వెడదాం?" అని నవ్వి, "మాట్లాడేందుకే లెండి, బాబూ" అన్నారు డైరెక్టరుగారు.

"రాఘవా, మరి నువ్వొచ్చేదాకా నే నుండను. మా మామగారి ఊరు వెళ్లి మా ఆవిణ్ణి చూసి అలా వెళ్లిపోతాను."

"అదేమిటోయ్! వచ్చినట్లే లేదు, అప్పుడే వెళ్లిపోతావా? మేం వచ్చేదాకా ఉండు."

"కుదరదులే. అన్నట్టు నరసింహం అడ్రెసుందా నీ దగ్గర?"

"ఉండాలి. మా రెండవ గదిలో టేబుల్ లేదూ— దాని పక్కన బీరువా ఉందా—"

"మీ ఇల్లు నాకు తెలియదులే!" అన్నాను నవ్వుతూ.

"అంటే?"

"నేను మీ ఇంట్లో ఉండటం లేదు."

"మరెక్క డుంటున్నావ్?"

## ఔన్నత్యం

**ఒక వ్యక్తి తన గుణగణాలను గురించి ఎంత తక్కువ తెలుసుకుని ఉంటే, అతణ్ణి అంత ఎక్కువగా ఇష్టపడడం జరుగుతుంది. అలా కాక, తన గొప్పలను గురించి ఎంత ఎక్కువగా చెప్పుకుంటే, అంత తక్కువగా అతణ్ణి గౌరవించడం జరుగుతుంది.**

—ఎమర్సన్

చెప్పాను హోటలు పేరు.

వత్తు వదిలి పోయిం దతనికి. "సారీ, గురూ, నువ్వు మా ఇంట్లోనే ఉంటున్నా వనుకుంటున్నాను. అంత దూరంనుంచి నువ్వొస్తే కనీసం నీ వెంటకూడా తిరగ లేదు. వెధవని. అయామ్ ఫూల్! పోనీ, ఒక పని చేస్తాను. ఈ ట్రిప్ కాన్సిల్ చేసుకుంటాను. నువ్వెళ్లకు."

"ఆవేశపడిపోకు, రాఘవా, ఇటీజ్ నాచురల్. నేను కాలేజీలో ఉండగా నువ్వొస్తే నేనూ వెంట తిరగడం పడదు. జీవితం శరవేగంతో పోయే రైలుబండి లాంటిది. దిగామంటే వెనకపడి పోతాం. కారీఆన్!"

"అయాం సారీ, గురూ, ఏమనుకోకు. ఈ సా రెప్పుడయినా రా. . ."

"సర్లే, నరసింహం అడ్రెసు చెప్పు."

"మా ఇంటికి వెళ్లి మా ఆవిణ్ణి అడుగుతే ఉత్తరాల ఫైలు ఇస్తుంది. అందులో అతని ఉత్తరం ఉంది. మరి నే ఉంటా. క్షమించు, గురూ. ఈ స్థితిలో ఇంటికొస్తే మా ఆవి డూరుకోదు— ఏడుస్తుంది."

రైలు కదిలిపోతూంది. మనస్సుకి ఆహ్లాదంగా ఉంటుందని ఇక్కడికి వచ్చాను. ఉన్న ఆనందంకూడా పోయింది రాఘవ భార్య అన్న మాటలు వింటే! "మీరే కా దన్నయ్యగారూ, నే నీ ఇంట్లోంచి ఎక్కడికయినా వెళ్లిపోయినా ఆయనకి తెలియదు. అసలింటికి వస్తేగా? ఎప్పుడూ ఆ సీసాలు. పోనీ అనుకున్నాను. ఈ మధ్య కొత్త కొత్త అలవాట్లుకూడా మొదలెట్టారు" అంది.

నే నావిడ వంక చూడలేకపోయాను. ఆమె కళ్లలో నీళ్లు చూడవలసి వస్తుం దేమోనని భయం!

నరసింహారావు పనిచేసే ఆఫీసుకు వెళ్లాను నేరుగా. పెద్ద హాల్లో రెండు బార్లుగా కూర్చుని ఉన్నారు. గోడల కానించి పెద్ద పెద్ద రాకులు, వాటి నిండా ఫైళ్లు— అసలయిన ఆఫీసు వాతావరణం కనపడింది.

ఒకాయనకి దగ్గరగా వెళ్లి మా వాడి పేరు చెప్పాను. ఆయన— "ఏ నరసింహా రావు— పీనా, ఎస్సా, ఆరా?" అనడిగాడు. చెప్పాను. అటు పక్కన ఎవరో ప్యూనుంటే వాడిని పిలిచి, "ఏ శ్రీగారి దగ్గరకు తీసుకెళ్లు ఈయన్ని" అన్నాడు.

సముద్రం మధ్యలోంచి వెడు తున్నట్లు అనిపించింది.

పెద్ద పుస్తకం ఏదో ముందేసుకుని అందులో దేని కోసమో వెతుకుతున్నాడు నరసింహం. వెళ్లి భుజంమీద చేయి వేశాను. తల ఎత్తి చూసి మళ్లీ తల దించుకుని మళ్లీ ఎత్తాడు.

"ఓరి నువ్వా! ఎవరో పార్టీ అనుకున్నాను. ఎప్పుడొచ్చావు? ఎక్కడి నుంచి వచ్చావు?"

"ఇప్పుడే రాఘవరావు దగ్గరనుంచి. అంతలా సన్నబడి పోయావేం?"

"చూశావుగా ఈ పుస్తకం? ఇటువంటివి మోస్తుంటే భీముడు, దుర్యోధనుడుకూడా సన్నపడి పోతారు" అన్నాడు.

"ఏమిటి అందులో నువ్వు వెతుకు తున్నది?"

"ఎవడో పక్షి డబ్బు కట్టానంటాడు. మా రికార్డు ప్రకారం కట్టినట్టు లేదు. పొమ్మన్నాను. వాడు పై ఆఫీసుకి కంప్లెయింటు పెట్టాడు. ఇదుగో, ఈ ఎర్రజండా ఉన్న ఉత్తరం. దానిమీద 'రెండు రోజులలోగా చర్య తీసుకోవాలి' అని ఎర్ర అక్షరాలతోనే రాశారు."

"సరేగాని, బయటికి వస్తావా?"

"ఈ పెట్టెమీద కాసేపు కూర్చో . . . పీడి గోల తేలిపోతోందిలే. పాపం, కట్టాడు. అందుకే లబ్బున గోలెట్టాడు. ఇదొక్కటీ డ్రాఫ్టు రాసి పైకి పంపేసి వస్తాను" అంటూనే మళ్లా పుస్తకం లోకి దూరాడు.

అంతమంది ఉండేందుకు తగినంత హాలు కా దది. అంతటా ఇరుకు. కిటికీల నిండా దస్త్రాలు పేర్చేయడం వలన వెలుతురుకూడా తగ్గిపోయింది. గాలి అసలు లేదు. అక్కడొకటి, అక్కడొకటి ఉన్నాయి ఫాన్లు. ఎక్కువ సేపు అక్క డుండటం కష్టమనిపించింది. పైగా, ఇతను ఈ పుస్తకంలోంచి ఊడొచ్చేలా లేడు. . . ఇక్కడా విధానం వేరయినా ఫలితం రాఘవరావు దగ్గర లాంటిదేనేమో ననిపించింది.

అస లొక వయస్సొచ్చాక, సంసారంలో పడిపోయి స్నేహితులమీద శ్రద్ధ తగ్గుతుందేమో? నే కూడా ఇంతేనా?

"పద, పోదాం" అన్నాడు నరసింహం, లేస్తూ.

